క్లుప్తంగా

నియామకం



భూపాలపల్లి రూరల్: మానవ హక్కుల కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడిగా కాటారం మండలానికి చెందిన ఆత్మకూరి స్వామిని నియమించినట్లు తెలంగాణ మానవహక్కుల రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య పేర్కొన్నారు. బుధవారం కమిటీ జిల్లా అధ్యక్షుడు దుండ్ర కుమార్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా భద్రయ్య హాజరై స్వామికి నియామకం పత్రం అందించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఈసీ మెంబర్ రాజయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి అమృత అశోక్, ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభ



మహదేవపూర్: మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ శ్రీపతిబాపు ఆధ్వర్యంలో గ్రామ సభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న 6 గ్యారంటీ పథకాలకు గ్రామ ప్రజలు దరఖాస్తులు సమర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సాల్మన్, కార్యదర్శి సమ్మయ్య, వార్డు మెంబర్లు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

కేసులను తొలగించుకోవాలి

మంగపేట: మద్యం తాగి వాహనం నడిపిన కేసులు నమోదైన ఉన్నట్లయితే ప్రస్తుతం జరుగుతున్న లోక్ అదాలత్‌కు హాజరై వారిపై ఉన్న కేసులను తొలగించుకోవాలని ఎస్సై గోదారి రవికుమార్ అన్నారు. మండలానికి చెందిన శివకుమార్, దినేష్ అనే ఇద్దరు వ్యక్తులు బుధవారం కోర్టులో హాజరుకాగా వారికి జరిమానా విధించి గతంలో వారిపై ఉన్న కేసులను తలగించినట్లు ఎస్సై తెలిపారు. గతంలో కేసుకు రూ.10,000ల జరిమామా విధించబడేదని ప్రస్తుతం జరుగుతున్న లోక్ అదాలత్‌లో రూ.2,000 జరమానా మాత్రమే విధిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 30లోపు ములుగు జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరు నేరాన్ని అంగీకరించినట్లయితే కేసులను తొలగించుకునే అవకాశం ఉందని అన్నారు.

పీసా గ్రామసభల ద్వారానే ఎంపిక చేయాలి

వెంకటాపురం(కె): ఏజెన్సీ ప్రాతంలో ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీ పథకాలను పీసా గ్రామ సభల ద్వారానే ఎంపిక చేయాలని ఆదివాసీ నవ నిర్మాణ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వాసం నాగరాజు అన్నారు. బుధవారం మండల పరిధిలోని చిరుతపల్లి గ్రామంలో ఆదివాసీ నవ నిర్మాణ సేన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీలో విధులు నిర్వహిస్తున్న అధికారులు పీసా చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరు గ్యారంటీ పథకాలు ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా ఉన్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అట్టం లక్ష్మయ్య, శివ, నారాయణ ఉన్నారు.

రోడ్డు నిర్మాణానికి కొలతలు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని జీసీసీ సేల్స్‌డిపో నుంచి శ్రీరాములు కేశవులు ఇంటి వరకు రూ. 50లక్షలతో 500ల మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టనున్నట్లు పీఆర్ ఏఈఈ భిక్షపతి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు కొలతలు వేశారు. గతంలో వేసిన రోడ్డు గుంతలుగా మారిందన్నారు. ఆరోడ్డుపైనే నూతనంగా 9 మీటర్ల వెడల్పుతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు వివరించారు. ఆయన వెంట నాయకులు ఆయూబ్, అక్బర్, సులేమాన్,

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు చేరాలి

పలిమెల: అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ పథకాలు చేరాలని జిల్లా వ్యవసాయాధికారి, మండల ప్రత్యేక అధికారి విజయభాస్కర్ అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న ప్రజాపాలన కార్యక్రమంపై బుధవారం ఎంపీపీ కుర్సం బుచ్చక్క అధ్యక్షతన మండలం కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ ప్రత్యేక అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయభాస్కర్ మాట్లాడుతూ.. అభయ హస్తంలో ఆరు గ్యారంటీలకు సంబంధించిన దరఖాస్తులను ప్రతి ఇంటికి గ్రామ సభకు ఒక రోజు ముందుగానే పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హేమ, ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి, సీడీపీఓ రాధికారెడ్డి, ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరైయ్యారు.



పలిమెల: మాట్లాడుతున్న విజయభాస్కర్

మహాముత్తారం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మండల అధికారులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేటి నుంచి జరపనున్న ప్రజాపాలన కార్యక్రమంపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు ఈ కార్యక్రమం ఉంటుందని ఆయా గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు, తహసీల్దార్ శ్రీనివాస్, పంచాయతీ అధికారి శ్రీనివాసరావుతో పాటు తదితరులు పాల్గొన్నారు.



మహాముత్తారం: మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రావు



టేకుమట్లలో..

టేకుమట్లలో..

టేకుమట్ల: నేటి (గురువారం)నుంచి జనవరి 6 వరకు గ్రామాల్లో కొనసాగే ప్రజాపాలన ప్రక్రియలో పంచాయితీ కార్యదర్శులు, నోడల్ ఆఫీసర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ మంజుల, ఎంపీడీఓ అనిత సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో ప్రజాపాలన కార్యక్రమంపై మండల ప్రత్యేకాధికారి శైలజ అధ్యక్షతన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలకు దరఖాస్తుల స్వీకరణ సందర్భంగా వృద్ధులకు, మహిళలకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి, క్యూ పద్ధతి పాటించేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సురేష్ పాల్గొన్నారు.

'ప్రజాపాలన' పకడ్బందీగా నిర్వహించాలి

కాటారం: గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీఓ నారాయణ, మండల ప్రత్యేకాధికారి సంజీవరావు అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులకు అభయాస్తంలో భాగంగా చేపట్టనున్న ఆరు గ్యారంటీలు, ప్రజాపాలన కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ శంకర్‌నాయక్, సీఐ రంజిత్‌రావు, ఎస్సై అభినవ్, ఎంపీఓ ఉపేంద్రయ్య, ప్రత్యేకాధికారులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజాపాలన సమీక్ష సమావేశం

మల్హర్: మండలంలోని తాడిచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహనపై మండల ప్రత్యేకాధికారి అవినాష్ అధ్యక్షతన అధికారుతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ.. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో నేటి 28 (గురువారం)నుంచి జనవరి 6 వరకు ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించినున్నట్లు తెలిపారు. నేడు (గురువారం) మల్లంపల్లి, కొండంపేట, దుబ్బపేట, చిన్నతూండ్ల, ఇప్పలపల్లి, అడ్వాలపల్లి గ్రామ పంచాయతీల్లో ఈనెల 29న తాడిచర్ల, ఎడ్లపల్లి, కొయ్యూరు, ఈనెల 30న వల్లెంకుంట, పెద్దతూండ్ల, జనవరి 2న మల్లారం, రుద్రారం, జనవరి 4న నాచారం, అన్సాన్‌పల్లి గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తహీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ నరసింహమూర్తితో పాటు తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీ సీఈఓ ఎల్.విజయలక్ష్మీ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శిలు, గ్రామా ప్రత్యేక అధికారులతో ప్రజాపాలనపై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామయ్య, తహసీల్దార్ సుమన్, ఎస్సై జంగిలి రమేష్, ఎంపీఓ రామకృష్ణ, పీఆర్ ఏఈ రవికుమార్, వివిధ గ్రామాల శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహదేవపూర్: ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణ కోసం గ్రామ పంచాయతీ కార్యదర్శులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి డీఎల్‌పీఓ సుధీర్‌కుమార్ హాజరై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాణిబాయి, జెడ్పీటీసీ అరుణ, ఎంపీటీసీ అకుతోట సుధాకర్, ఎంపీడీఓ రవీంద్రనాథ్, తహసీల్దార్ లక్ష్మిరాజయ్య, డీఈ సాయిలు, ఎంపీఓ ప్రసాద్, ఎస్సై రాజ్‌కుమార్, గ్రామ కార్యదర్శులు పాల్గొనారు.

ప్రజాపాలనకు పకడ్బందీ ఏర్పాట్లు

రేగొండ: ప్రజాపాలన కార్యక్రమ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని మండల ప్రత్యేక అధికారి శామ్యుల్ అధికారులకు సూచించారు. మండల స్థాయి అధికారులతో బుధవారం ప్రజాపాలన గ్రామ సభల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శామ్యుల్ మాట్లాడుతూ.. ప్రజాపాలన సభ నిర్వహణకు స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని వారిని భాగస్వామ్యం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ సురేందర్, తహసీల్దార్లు సత్యనారాయణ స్వామి, రవికుమార్, ఏఓ వాసుదేవరెడ్డి, డాక్టర్ హిమబిందు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి సునీత అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికల్లో గ్రామ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఇన్‌చార్జ్‌లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ కృష్ణవేణి, మండల వైద్యాధికారి నాగరాణి, ఎంపీఓ వీరస్వామి, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాటీ టీచర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రజాపాలన ప్రారంభం

కాటారం: ప్రభుత్వ ఆదేశాల మేరకు నేడు(గురువారం) నుంచి గ్రామపంచాయతీల్లో ప్రజాపాలన గ్రామసభలు ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ శంకర్‌నాయక్ తెలిపారు. వీరాపూర్, మద్దులపల్లి, ధర్మాసాగర్ గ్రామపంచాయితీల్లో ఈ నెల 28, 29న, ప్రతాపగిరి, బయ్యారం జీపీల్లో ఈ నెల 28 నుండి 30 వరకు, ధన్వాడలో 28, 29, 30, జనవరి2న, నస్తూర్‌పల్లి, గుమ్మాళ్లపల్లిలో 29, 30న, విలాసాగర్, ఆదివారంపేటలో 29, 30, 2న, శంకరాంపల్లి, కొత్తపల్లిలో 29, 30, జనవరి 2, 3 తేదిల్లో, మేడిపల్లిలో 30, జనవరి 2న, ఒడిపిలవంచలో 30, జనవరి 2, 3న, ఇబ్రహీంపల్లిలో 30, జనవరి 2, 3, 4 తేదిల్లో, చింతకాని, గంగారం జీపీల్లో 30, జనవరి 2, 3, 4,5 తేదిల్లో, దామెరకుంటలో 30, జనవరి 2, 3, 4,5, 6 తేదిల్లో, గుండ్రాత్‌పల్లి, అంకుషాపూర్, జాదారావుపేట, చిద్నెపల్లిలో జనవరి 2,3,4, రేగులగూడెం, కాటారంలో జనవరి 2 నుండి 6 వరకు గ్రామసభలు కొనసాగుతాయని ఎంపీడీఓ వివరించారు.



మహదేవపూర్‌లో..



కాటారం: మాట్లాడుతున్న ఆర్డీఓ నారాయణ



మల్హర్: అవగాహన కల్పిస్తున్న అవినాష్



చిట్యాల: మాట్లాడుతున్న విజయలక్ష్మి



రేగొండ: మాట్లాడుతున్న శామ్యుల్

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

మల్హర్: తాడిచర్ల తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో మండలంలోని మల్లారం జిల్లాపరిషత్ పాఠశాలలో ఆర్థిక అక్షరాస్యతపై బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్థిక అక్షరాస్యత, బ్యాంక్ అందిస్తున్న సేవలు బీమా, సామాజిక భద్రత పథకాలు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, నగదు రహిత లావాదేవీలు, సైబర్ మోసాలపై ఎంవీ రూరల్ ఫోక్ ఆర్గనైజెషన్ హైదరాబాద్ కళాజాతా వారిచే పాటల ద్వారా మ్యాజిక్ షో నిర్వహించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, కళాజాతా సిబ్బంది, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న మేనేజర్ శ్రీనివాసరావు

గ్యాస్ ఈ-కేవైసీ కోసం పడిగాపులు



జీసీసీ కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు

ఏటూరునాగారం: గ్యాస్ కనక్షన్ ఉన్న లబ్ధిదారులు గ్యాస్ ఈ-కేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు ఏటూరునాగారంలో ఉన్న హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ గిరిజన సహకార సంఘం కార్యాలయానికి ఈ-కేవైసీ కోసం మూడు మండలాల నుంచి లబ్ధిదారులు రావడంతో రద్దీ పెరిగింది. ఈ కేవైసీ చేస్తుండగా సర్వర్ డౌన్ వల్ల, నెట్‌వర్క్ పూర్ అవస్థలతో లబ్ధిదారులు గంటల తరబడి వేచి చూస్తున్నారు. గ్రామాల వారీగా కేవైసీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని లబ్ధిదారులు జీసీసీ అధికారులను కోరుతున్నారు.

ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం..

గ్యాస్ ఈ కేవైసీ చేయించడానికి సిబ్బందిని మరింతమందిని ఏర్పాటు చేశాం. కేవైసీ కోసం వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా వెనువెంటనే జరిగేలా చర్యలు చేపట్టాం. కేవైసీ చేసుకోవడానికి ఎలాంటి కాల పరిమితి లేదు. నిరంతరం సాగుతుంది.

\- దేవ్‌నాయక్,
జీసీసీ మేనేజర్ ఏటూరునాగారం

చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

మహాముత్తారం: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 60 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు బుధవారం మండల కేంద్రంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. జెడ్పీటీసీ శారద, ఎంపీటీసీ సురేష్ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

'ప్రజాపాలన'పై స్పష్టత కరువు

మంగపేట: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాల అమలు చేసేందుకు ప్రతిష్టాత్మకంగా గురువారం నుంచి నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామసభల నిర్వహణపై స్పష్టమైన సమాచారం లేక పోవడంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. ప్రభుత్వ పథకాలను పొందెందుకు ప్రజలకు దరఖాస్తు ఫారాలను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తుందని ప్రభుత్వం ప్రచార మాధ్యమాల్లో అధికారికంగా ప్రకటనలు ఇస్తుంటే మరోపక్క కొత్త రేషన్ కార్డు పొందెందుకు, రేషన్‌కార్డు బదిలీ, సవరణలకు మీసేవా కేంద్రం దరఖాస్తు ఫారంతో పాటు ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్ ఉండాలని వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు పెడుతున్నారు. దీంతో ఏది నిజమో తలియక ప్రజలు సందిగ్ధంలో ఉన్నారు. మండలంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు లేక పోవడంతో వారి స్థానాల్లో ప్రత్యేక అధికారులుగా విధులు నిర్వహిస్తున్న అధికార యంత్రాగం ప్రజలకు జవాబుదారిగా పనిచేయాల్సి ఉన్నప్పటికీ గ్రామాలకు వారు చుట్టపు చూపుగా వచ్చి పోతున్నారే తప్ప ప్రభుత్వ పథకాల అమలులో ప్రజలకు ఎలాంటి సమాచరం ఇవ్వడంలేదని, తెలుసుకునేందుకు కనీసం అందుబాటులో ఉండకుండా ప్రజా సమస్యలను పట్టించుకోకుండా విస్మరిస్తున్నారని ప్రజలు మండి పడుతున్నారు. ఇప్పటికైన జిల్లా అధికారులు స్పందించి గ్రామ స్థాయి అధికారులు స్థానికంగా ఉండి ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమంపై ప్రజలకు ముందస్తు సమాచారం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

వెంకటాపురం(కె): పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామని ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూరిబాగాంధీ పాఠశాలలో విద్యార్థులకు వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు కోవిడ్ 19 వ్యాప్తి చెందకుండా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మాస్కు ధరించాలని, తరుచూ చేతులు కడుక్కోవాలని సూచించారు. అనారోగ్యంగా ఉన్న విద్యార్థులు మందులు తప్పనిసరిగా వాడాలని అన్నారు. అనంతరం మరికాల సబ్ సెంటర్‌ను సందర్శించి వ్యాక్సినేషన్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి భవ్యశ్రీ

వ్యాక్సినేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని సబ్ సెంటర్లలో గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు అందజేస్తున్న వ్యాక్సినేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఏఎన్‌ఎం భాగ్యమ్మ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆకువారిఘణపురం సబ్ సెంటర్‌లో గర్భిణుల, చిన్నారులకు చుక్కల మందు, వ్యాక్సినేషన్ ఇచ్చారు. గర్భిణీతో ఉన్న వారు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. అలాగే బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని, పుట్టిన బిడ్డకు ముర్రుపాలు ఇవ్వాలన్నారు. తల్లిపాలతో వారిలో వ్యాధినిరోధక శక్తిపెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు స్వరూప, నాగమణి తదితరులున్నారు.



చుక్కల మందు వేస్తున్న వైద్య సిబ్బంది

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ఏటూరునాగారం: మల్లంపల్లి మండలంలోని నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు డివైడర్‌ను ఢీకొని ఇద్దరు ద్విచక్రవాహన దారులు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని ఆకులవారిఘణపురం ప్రాంతానికి చెందిన ఆధార్ నమోదు కేంద్రం నిర్వాహకుడు మల్యాల అనిల్, మండలంలోని రొయ్యూర్ గ్రామానికి చెందిన వివేకానంద ప్రైవేట్ పాఠశాలలో హిందీ టీచర్‌గా పనిచేస్తున్న కరీంలకు తీవ్ర గాయాలు అయ్యాయి. కరీం వాళ్ల స్నేహితుడి తండ్రి అంత్యక్రియలకు వెళ్లి వస్తుండగా, అనిల్ ఆధార్ విషయంలో ట్రైనింగ్ పూర్తి చేసుకొని ఇరువురు ఒకే బైక్‌పై వస్తున్నారు. ఈ క్రమంలో మల్లంపల్లి వద్ద బైక్ అదుపు తప్పి డీవైడర్‌ను ఢీకొట్టింది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహారావు ఆ రోడ్డు గుండా వస్తుండడంతో వాహనం నిలిపి క్షతగాత్రులను ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. వీరి పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు తెలిపారు.



గాయపడిన కరీం



గాయపడిన అనిల్

బాధిత కుటుంబాలకు పరామర్శ

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలంలోని కొంపెల్లి గ్రామానికి చెందిన మాజీ ఆర్మీ సైనికుడు రొంటాల విప్లవేందర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చందుపట్ల సత్యపాల్‌రెడ్డి పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి నివాళులర్పించారు.గ్రామ పార్టీ నాయకులు, తదితరులు ఉన్నారు.

ములుగు రూరల్: మండలంలోని కాశిందేవిపేట గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు చెలమల్ల రామస్వామి అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎండీ చాంద్‌పాషా బుధవారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. రామస్వామి మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట పీఏసీఎస్ వైస్ చైర్మన్ మర్రి రాజుయాదవ్, సుధాకర్‌రావు, సంపత్‌రావు, దేవేందర్‌రావు, మల్లయ్య, దేవేందర్ ఉన్నారు.

ఎస్‌ఎస్ తాడ్వాయి: మండలంలోని బయ్యక్కపేట గ్రామానికి చెందిన గుర్రం శ్రీమాన్‌రెడ్డి ఇటీవల ఇరాన్ సముద్రం నీటిలో గల్లంతయ్యాడు. దీంతో అతడి తల్లిదండ్రులు సర్పంచ్ గుర్రం రమ–సమ్మిరెడ్డిలను, కుటుంబ సభ్యులను బుధవారం పలువురు నాయకులు పరామర్శించారు. శ్రీమాన్ గల్లంతైన విషయంపై తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. శ్రీమాన్ సముద్రంలో గల్లంతవడం చాలా బాధకరమన్నారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ పాక సాంబయ్య, సర్పంచ్ ఇర్ప సునీల్, బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు యాదిరెడ్డి ఉన్నారు.

ఏటూరునాగారం: మండల కేంద్రానికి భార్గవ్, శ్రీదేవి ఇటీవల ఎల్కతుర్తివద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. దీంతో వారు వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు బుధవారం పరామర్శించారు.



భూపాలపల్లి రూరల్: నివాళులర్పిస్తున్న సత్యపాల్‌రెడ్డి

పొగమంచుపై అప్రమత్తంగా ఉండాలి

కాటారం: శీతాకాలం ప్రభావంతో ప్రతి రోజు ఉదయం వీస్తున్న పొగమంచుపై వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని కాటారం సీఐ రంజిత్‌రావు సూచించారు. తెల్లవారుజాము నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకు పొగమంచు దట్టంగా కమ్ముకోవడంతో ఎదురెదురుగా వచ్చే వాహనదారులు ఒకరికి ఒకరు కనిపించడం లేదన్నారు. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పనుల నిమిత్తం ఉదయం బయటకు వచ్చే వాహనదారులు ఖచ్చితంగా తమ వాహనం లైట్ వేసుకొని ప్రయాణించాలని, అలాగే ట్రాక్టర్లు, భారీ వాహనదారులు ఎదురు, వెనకాల వచ్చే వాహనాలకు కనిపించేలా రేడియం స్టిక్కర్లు వేసుకోవాలని పేర్కొన్నారు. అత్యవసర పనుల అయితేనే వాహనదారులు బయటకు రావాలని, జాగ్రత్త చర్యలు తప్పకుండా పాటించాలని సీఐ తెలిపారు. పశు పోషకులు తమ పశువులు, గేదెలను రోడ్లపై విచ్చల విడిగా రోడ్లపై వదలిపెట్టవద్దని బాధ్యతగా వాటిని ఇంటి వద్ద ఉంచుకోవాలని అన్నారు.